క్లుప్తంగా

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

డిండి : ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామపంచాయతీలతోపాటు మండల కేంద్రంలోని పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం డిండి ప్రాజెక్టులో లక్ష ఉచిత చేప పిల్లలను వదిలిననంతరం మండల కేంద్రంలో హైవేపై ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఆర్ వీఆర్, ఎంపీపీ సునీతా జనార్దన్‌రావు, పీఆర్ ఏఈ విజయ్‌కుమార్, ఎఫ్‌డీఓ మారయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

మిర్యాలగూడ టౌన్ : జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ర్యాంకు పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేసుతన్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మహ్మద్ ఆరీఫ్ నల్లగొండలో డీఈఓ బిక్షపతిని కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు ఉంచి మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు.

త్వరలో బీజేపీలోకి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

గుర్రంపోడు : బీఆర్ఎస్‌ను వీడి త్వరలో బీజేపీలో చేరుతున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల పదో తేదీలోగా తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరుతానని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు గంగిడి మనోహర్‌రెడ్డిలను, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డిలను కలిసినట్లు తెలిపారు.

బాధితుడికి ఫోన్ అప్పగింత

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని బడాయిగడ్డ గ్రామానికి చెందిన తురక రాంబాబు గతంలో ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఫోన్ పోయిన విషయాన్ని రాంబాబు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను ట్రాప్ చేసి పోగొట్టుకున్న వ్యక్తికి అందించారు.

క్రీడా కిట్ల పంపిణీ

మిర్యాలగూడ : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి ఆయా గ్రామ పంచాయతీలకు క్రీడా కిట్‌లను పంపిణీచేసి మాట్లాడారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు భోగవెల్లి వెంకటరమణచౌదరి, ఎంపీఓ వీరారెడ్డి, సూపరింటెండెంట్ కరుణాకర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ అర్బన్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం 15వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాన్ని, పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.సయ్యద్, కార్మికులు బంటు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాలు సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : స్థానిక మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో యంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో లైబ్రేరియన్ కుమ్మరకుంట్ల సుధాకర్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామానికి లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కును బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి గురువారం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పందుల జానకిరాములు, పందుల సైదులు, లింగయ్య, రాములు, సైదులు, చిన సైదులు, సైదిరెడ్డి, యాదగిరి, శ్రీను, నరేందర్, సతీష్, సందీప్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

దేవరకొండ : రాష్ట్రంలో ఉద్యోగ నియామక రాత పరీక్షల పేపర్ల లీకులు, పరీక్షల రద్దులతో ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటమాడుతుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యలమల గోపిచంద్ అన్నారు. గురువారం దేవరకొండ బస్టాండ్ ఎదురుగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష రెండు పర్యాయాలు వాయిదా పడడం టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యానికి అద్దంపడుతుందన్నారు.

పేద విద్యార్థులకు బాసటగా

- ఇద్దరు నిరుపేద విద్యార్థులను ఎంబీబీఎస్ చదివిస్తూ..
- సామాజిక సేవా కార్యక్రమాల్లో వడ్త్య రమేశ్‌నాయక్
- ఆర్చన్ ఇన్వెన్షన్ అండ్ స్టెర్లింగ్ గ్రూప్ ద్వారా విస్తృత సేవలు



సామాజిక సేవా కార్యక్రమంలో చెక్కు అందజేస్తున్న వడ్త్య రమేశ్‌నాయక్ (ఫైల్)

చందంపేట : ప్రజా సేవ చేయాలనే తలంపుతో.. ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి రాజకీయ అరంగేట్రం... రాజకీయంగా నెలదొక్కుకునేందుకు కొంత సమయం తీసుకున్నా.. ప్రజా సేవలో ముందుంటూ ప్రజల మన్ననలు పొందిన వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు ఆయన. దేశ రాజధాని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఉన్నతోద్యోగంతో మొదలైన ఆయన ప్రస్థానం ప్రస్తుతం రాజకీయ నేతగా సాగుతోంది. వెనుకబడిన దేవరకొండ నియోజకవర్గంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు.. ఆడ శిశువుల విక్రయాలు, నిరక్షరాస్యతను రూపుమాపేందుకు తనవంతుగా రాజకీయంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు రాజకీయ అరంగేట్రం చేశారు.. వడ్త్య రమేశ్‌నాయక్.

ప్రస్థానం సాగిందిలా..

డిండి మండలంలోని సింగరాజుపల్లి గ్రామానికి చెందిన వడ్త్య రమేశ్‌నాయక్ దేశ రాజధాని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఉన్నతోద్యోగం పొందారు. ఆ తర్వాత వెనుకబడిన దేవరకొండ నియోజకవర్గంలో శిశు విక్రయాలు, నిరక్షరాస్యత తదితర సమస్యల పరిష్కారానికి తనవంతుగా పోరాటం చేసేందుకు సిద్ధమయ్యాడు.. ఈ క్రమంలోనే 2004లో ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. రాజకీయంగా కొనసాగుతూనే తన సొంత కంపెనీ అయిన ఆర్చన్ ఇన్వెన్షన్ అండ్ స్టెర్లింగ్ గ్రూప్ ద్వారా ప్రజా సేవా కార్యక్రమంలో కొనసాగిస్తు వస్తున్నారు.

సేవా కార్యక్రమాలతో..

- ఆర్చన్ ఇన్వెన్షన్ అండ్ స్టెర్లింగ్ గ్రూప్ ద్వారా అనేక మంది నిరుపేదలను ఆదుకున్నారు. పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించడంలో ముందుంటున్నాడు.
- ఇద్దరు నిరుపేద విద్యార్థులకు ఎంబీబీఎస్ చదివిస్తూ ఆర్థికంగా తోడ్పాటు
- మరో విద్యార్థిని ఐఐటీ చదివిస్తున్నాడు.
- కొన్ని వందల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకంటున్నారు.
- పేద కుటుంబంలో ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థికంగా సాయం అందించారు.
- దేవాలయాల నిర్మాణానికి ఆర్థికంగా తోడ్పాటు అందించారు.
- నియోజకవర్గంలోని క్రీడాకారులకు క్రీడా కిట్లను అందజేశారు.
- కోవిడ్ సమయంలో కొన్ని గ్రామాల్లో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.
- వినాయక చవితి సందర్భంగా కొన్ని గ్రామాల్లో గణేశ్ విగ్రహాలను అందించారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి సిద్ధం



ప్రజా సేవ చేయాలనే తలంపుతో ఉన్నతోద్యోగం వదిలి రాజకీయాల్లోకి వచ్చాను. 2004లో మొదలైన నా రాజకీయ ప్రస్థానంలో దేవరకొండ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇచ్చాను. శిశు విక్రయాలు, ఆర్థిక నిరక్షరాస్యత రూపు మాపడం, నియోజకవర్గ వ్యాప్తంగా సమస్యల పరిష్కారానికి రాజకీయాన్ని వేదిగా మలచుకున్నాను. ఈసారి కాంగ్రెస్ పార్టీ నుంచి అవకాశం వస్తే ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. రాజకీయ నేతగానే కాకుండా ప్రజా సేవ చేయాలనే ఉద్దేశంతో పేద విద్యార్థుల చదువులను ప్రోత్సహిస్తున్నాను. నా సొంత ఖర్చులతో ఇద్దరు పేద విద్యార్థులను ఎంబీబీఎస్‌ను చదివిస్తున్నాను. ఎంతో మందికి నా వంతుగా ఆర్థిక సాయం అందించాను. ప్రజల ఆశీర్వదం నాపై ఉన్నాయి. ఈ నమ్మకమే నన్ను రాజకీయనేతగా నడిపిస్తుంది.

– వడ్త్య రమేశ్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు



మాడుగులపల్లి : వంతెనను ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మాడుగులపల్లి : గ్రామాల సమగ్రాభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించి, పెండింగ్ పనులకు శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో సాగునీరు, విద్యుత్ రంగాల్లో రాష్ట్రం ఎనలేని పురోగతి సాధించిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా కుక్కడం, పాములపాడు గ్రామాల్లో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోకల విద్యారాజు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, సర్పంచులు మారుతి వెంకట్‌రెడ్డి, అలుగుబెల్లి గోవిందరెడ్డి, యాతం లక్ష్మీనరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కళింగరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాబయ్య, రాష్ట్ర నాయకుడు నిమ్మల నవీన్‌రెడ్డి, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, పీఆర్ఈఏఈ నరేష్ పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ : ఈనెల 10వ తేదీన మిర్యాలగూడలో మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం స్థానిక ఎస్వీ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, ఎంపీపీ సరళ హన్మంతరెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మార్కెట్ చైర్మన్ బుచ్చయ్య, వైస్ చైర్మన్ వీరకోటిరెడ్డి, నాయకులు మోసిన్‌అలీ, హాతీరాం నాయక్, బాలాజీనాయక్, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, బాలబయ్య తదితరులు పాల్గొన్నారు.

నాన్‌లోకల్ వ్యక్తికి టికెట్ కేటాయింపుపై ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

దేవరకొండ : బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) దేవరకొండ ఎమ్మెల్యే టికెట్ నాన్‌లోక్ వ్యక్తికి కేటాయించారని స్థానిక బీఎస్పీ నాయకులు పట్టణ కేంద్రంలోని ఐబీ బంగ్లా వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అట్టికేశ్వరం దయాకర్ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి బీఎస్పీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న రమావత్ రమేశ్‌నాయక్‌ను కాదని నాన్‌లోకల్ వ్యక్తికి టికెట్ కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈవిషయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణుల అభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న రమేశ్‌నాయక్‌కు టికెట్ ఇవ్వాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాకులు రమావత్ రమేశ్‌నాయక్, ముదిగొండ మొగిలయ్య, గ్యార యాదగిరి, రావులపల్లి ఆంజనేయులు, కేతావత్ మగులాల్‌నాయక్, ధర్మపురం శ్రీనివాస్, మహమ్మద్ ఇమ్రాన్, పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శం.. తెలంగాణ



హాలియా : సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాన చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచిందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని మూడో వార్డులో సీడీఎఫ్ నిధులు రూ. 10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ కృషితోనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాయన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ని మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనుముల, తిరుమలగిరి మండలాల ఎంపీపీలు పేర్ల సుమతిపురుషోత్తం, ఆంగోతు భగవాన్‌నాయక్, మండల రైతు బంధు సమితి కోఆర్డినేటర్ రావుల చిన బిక్షం యాదవ్, జిల్లా మున్సిపల్ కౌన్సిలర్ల ఫోరం అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు అన్నెపాక శ్రీనివాస్, రామకృష్ణ, రమేష్ జీ, ఆదాసు విక్రమ్, మోహన్‌నాయక్, మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు యాదవ్ తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్ నియామకాల్లో బీసీలకు తీవ్ర అన్యాయం

మిర్యాలగూడ అర్బన్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించిన కానిస్టేబుల్ నియామక ఫలితాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 115 మార్కులు సాధించిన బీసీ అభ్యర్థికి కానిస్టేబల్ ఉద్యోగం రాలేదని కేవలం వంద మార్కులు వచ్చిన ఓసీ అభ్యర్థికి ఉద్యోగం రావడం ఎంతవరకు సమంజసం అన్నారు. దేశ జనాభాలో రెండు శాతం ఉన్న అగ్రకులాలకు ఈడబ్ల్యూఎస్ పేరిట పదిశాతం రిజర్వేషన్ ప్రవేశ పెట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60శాతం ఉన్న బీసీ లకు 27శాతం రిజర్వేషన్ పెట్టి బీసీలకు ఉద్యోగ, రాజకీయ రంగంలో తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలగాని వెంకటేశ్‌గౌడ్, లింగయ్య, షేక్ జిందా, వేముల రాములు, గోపి, జనార్దన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయాలి

- సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్



పెద్దవూర : లిఫ్ట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భగత్



హాలియా : మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

పెద్దవూర : మండలంలోని పూల్యాతండా సమీపంలోని ఏఎమ్మార్పీ లో లెవల్ కెనాల్ పంప్‌హౌజ్ వద్ద డీ–8, 9 కాలువకు నిర్మిస్తున్న లిఫ్ట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతాంగానికి సాగు నీటిని అందించాలని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. గురువారం మండలంలోని పూల్యాతండా వద్ద నిర్మాణంలో ఉన్న లిఫ్ట్ పనులను పరిశీలించి మాట్లాడారు. డీ–8,9 కాలువ చివరి రైతులకు సాగు నీరందక పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.2.47 కోట్లతో ఏఎమ్మార్పీ లో లెవల్ పంప్‌హౌజ్ వద్ద లిఫ్టును ఏర్పాటు చేస్తున్నట్లు వారం, పది రోజుల్లో పనులు పూర్తి అవుతాయని తెలిపారు. లిఫ్టుతో ఈ ప్రాంత రైతులకు 7163 ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. అనంతరం పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాదం సంపత్‌కుమార్, కర్న బ్రహ్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు గజ్జెల లింగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే బషీర్, డీఈఈ ఎం.లలిత, ఏఈఈలు రవిరాజ, గుణసుందరి, నాయకులు గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, రాజేష్‌నాయక్, శ్రీకర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

హాలియా : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 242మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే నోముల భగత్ పంపిణీ చేసి మాట్లాడారు. అంతకు ముందు 'మన వార్డు, మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జీఓ నంబర్ 58, 59 ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేద ప్రజలకు ఇళ్ల పట్టాలను అందజేశారు. అదే విధంగా అనుముల మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, హాలియా, నిడమ నూరు మార్కెట్ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, రాష్ట్ర నాయకులు యడవెల్లి మహేందర్‌రెడ్డి, కర్ల బ్రహ్మారెడ్డి, తహసిల్దార్ జయశ్రీ, కౌన్సిలర్లు నల్లబోతు వెంకటయ్య, ప్రసాద్ నాయక్, పట్టణ అధ్యక్షుడు ముత్యాలు, సత్యం, మార్కెట్ వైస్ చైర్మన్ రామలింగయ్య, ఫాక్స్ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సురబి రాంబాబు తదితరులు ఉన్నారు.

బతుకమ్మల చీరల పంపిణీ

హాలియా పట్టణంలో పురపాలక సంఘం కార్యాలయం వద్ద మహిళలకు ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నోముల భగత్ ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీ మరో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కందిమల్ల వీరారెడ్డి, వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, కౌన్సిలర్ ప్రసాద్ నాయక్, మున్సిపల్ మేనేజర్ రషీద్, తహసీల్దార్ జయశ్రీ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం విఫలం

మిర్యాలగూడ అర్బన్ : పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ముడావత్ జగన్‌నాయక్ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తుంగపాడులోని మోడల్ స్కూల్‌లో మౌలిక వసతులపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం అందించే పేరుకు సన్న బియ్యం అయినా పురుగులతో కూడిన బియ్యాన్ని సరఫరా చేస్తున్నారని విమర్శించారు. దీంతో విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగేష్, కనకయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ మహిళకు బతుకమ్మ చీర అందజేస్తాం



మిర్యాలగూడ టౌన్ : బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ ప్రతీ మహిళకు అందిస్తామని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలో 48 వార్డుల్లో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 45వ వార్డు షాబునగర్‌లో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌తో కలిసి బతుకమ్మ చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ పోతేపాక బక్కయ్య, సీఓలు మామిడాల శ్రీనివాస్, వెంకటేశ్వర్లుమ తదితరులున్నారు. అలాగే బాపూజీనగర్‌లోని మహిళలకు బతుకమ్మ చీరలను మున్సిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వర్‌రావు గురువారం పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధికార ప్రతినిధి పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్ సందేశీ ఆంజనేయరాజు, మోహన్‌రావు, చందన్‌సింగ్, రామారావు, మీనరెడ్డిలతో పాటు పలువురు మహిళలు తదితరులున్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని మొల్కచర్ల గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న బతుకమ్మ చీరలను గురువారం ఎంఈఓ బాలాజీనాయక్, సర్పంచ్ పేరుమళ్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్ దైద వెంకయ్య, రవిల చేతుల మీదుగా పంపిణీ చేశారు.

సమ్మెతోనే డిమాండ్లను అంగీకరించిన ప్రభుత్వం



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లేశ్

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీలు పట్టువీడకుండా 24రోజుల పాటు సమ్మె చేయడంతోనే ప్రభుత్వం దిగి వచ్చి కొన్ని డిమాండ్లను అంగీకరించిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ, ఏఐటీయూసీ) జేఏసీ ఆధ్వర్యంలో విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు ఎండీ సయిద్, బైరెడ్డి రాణి, తిరుపతి రామ్మూర్తి, రామయ్య, మల్లు గౌతమ్‌రెడ్డి, లింగానాయక్, జిల్లా యాదగిరి, వెంకన్న, అంగన్‌వాడీ టీచర్లు తూడి అరుణ, నాగమణి, వజ్రమ్మ, మల్లేశ్వరీ, భాగ్యమ్మ, లక్ష్మి, సత్యలక్ష్మి, ప్రమీల, రాధాబాయి, రజని, శ్రీదేవి, ఝాన్సీ, విజయలక్ష్మి ఉన్నారు.

కొండమల్లేపల్లి : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు రాష్ట్రవ్యాప్తంగా 24 రోజుల పాటు చేపట్టిన సమ్మెకు తెరపడింది. 'చలో హైదరాబాద్' సందర్భంగా మంత్రులతో నిర్వహించిన చర్చల్లో కొన్ని డిమాండ్లకు ఒప్పుకోవడంతో సమ్మెను విరమిస్తూ అంగన్‌వాడీలు గురువారం విధులకు హాజరయ్యారు. కొండమల్లేపల్లి ప్రాజెక్టు టీచర్లు, ఆయాలు, మినీ టీచర్లు సీడీపీఓకు జాయినింగ్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి నల్లా వెంకటయ్య, కోట్ల శోభ, పరిపూర్ణ, సంపూర్ణ, జయంతి, పద్మ, విజయలక్ష్మి, రజిత, రాధిక, అంజలి, కవిత, తేజస్విని, పద్మ, విజయ, సుజాత, జ్యోతి, అనురాధ, మమత, ధనమ్మ, అనిత, కీర్తి, అలివేలు, ఉమా, నిర్మల, అంజలి, సుశీల, సులోచన తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి.. కానిస్టేబుళ్లుగా ఎంపికై



తురక సందీప్



క్రాంతి గౌడ్



సంతోష్‌రెడ్డి



విజయ్

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు బుధవారం రాత్రి విడుదల చేసిన ఫలి తాల్లో మండలంలోని తడకమళ్ల గ్రామానికి చెందిన నలుగురు అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందారు. గ్రామానికి చెందిన తురక సందీప్, అంతటి క్రాంతి గౌడ్, అలగుబెల్లి సంతోష్‌రెడ్డి, పొట్టిపాక విజయ్‌లు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. వారి తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, ప్రజాప్రతినిధులు అభినందించి సన్మానించారు.

పులిమామిడి నుంచి ఎనిమిది మంది ఎంపిక



మాలె మమత



బూరుగు కళ్యాణి



కనకరాజు అఖిల



మైల నాగిరెడ్డి



కె. వీక్షిత్‌రెడ్డి



అర్కపల్లి ప్రశాంత్

హాలియా : అనుముల మండలంలోని పులిమామిడి గ్రామం నుంచి ఆరుగురు యువకులు, ఇద్దరు యువతులు పోలీసు కొలువులను సాధించారు. మాలె మమత (సివిల్), కందిమల్ల వీక్షిత్ రెడ్డి (సివిల్), మైలా నాగిరెడ్డి (సివిల్), కొండ శివ సివిల్ విభాగంలో ఉద్యోగాలు సాధించగా బూరుగు కళ్యాణి (ఎక్సైజ్), కొల్లు కోటిరెడ్డి (ఏఆర్), చానాల వెంకట్‌రెడ్డి (ఏఆర్), కంపసాటి గణేష్ ఏఆర్ విభాగంలో ఎంపికయ్యారు. వీరిని గ్రామస్తులు అభినందించారు.

చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి..



నేనావత్ పవిత్ర

దేవరకొండ : ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి పేదరికం అడ్డు కాదని నిరూపించింది దేవరకొండ మండలంలోని కొండభీమనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పర్యతండాకు చెందిన నేనావత్ పవిత్ర బుధవారం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది. తన నాల్గవ తరగతి చదువుతుండగా తండ్రి మృతి చెందడంతో తల్లి నేనావత్ లక్ష్మి తాపీ మేస్త్రి కూలి పనులు చేస్తూ తన నలుగురు పిల్లలను పోషించింది. ఈ క్రమంలోనే 3వ సంతానమైన పవిత్ర పాలమూరు యూనివర్సిటీలో పీజీ ఎంఎస్‌డబ్ల్యూ పూర్తి చేసింది. కానిస్టేబల్ ఉద్యోగం సాధించడంపై పలుగురు పవిత్రను అభినందిస్తున్నారు.

రాజకీయాలకు అతీతంగా భాగస్వాములు కావాలి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు ఉద్యమంలో రాజకీయాలకు అతీతతంగా భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం స్థానిక ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ వద్ద జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం జిల్లా ఏర్పాటుపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలన్నారు. జిల్లా సాధన సమితి చేపట్టనున్న ఉద్యమానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అలాగే మిర్యాలగూడను జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖలను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పంపించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల రాష్ట్ర నాయకులు సైదులు, సత్యప్రసాద్, రాజీరెడ్డి, రవికుమార్, రామచంద్రారెడ్డి, శేఖర్, వెంకటేశ్వర్లు, నాగరాజు, రామయ్య, దుర్గభావని ఉన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మాడుగులపల్లి : పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్, మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. అన్నివర్గాల అభ్యున్నతికి సర్కారు సమప్రాధాన్యం ఇస్తుందన్నారు. రైతుబంధు, రైతు బీమా పథకాలతో రైతుల జీవితాల్లో వెలుగు నింపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. అంతకుముందు మండల కేంద్రంలో రూ.5కోట్ల 80 లక్షలతో నిర్మించనున్న కేజీబీవీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సలహాదారు పోకల రాజు, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు శివ, నాయకులు వివేక్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.